
"విష్ యూ గుడ్ లక్!" కారు ఆపి, నేను దిగగానే, నావేపుచూస్తూ, కొంటెగా కన్నుగీటుతూ అన్నాడు రాజా.

ప్రతిగా ప్రతిసారిలానే గొప్పగా నవ్వబోయాను కానీ, ఎంచేతనో నవ్వలేకపోయాను.

"రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో అంటే సుమారు మూడుగంటల తర్వాత కారు ఇక్కడికే తెచ్చి, ఈ మలుపు దగ్గరే ఆపుతాను.. నువ్వు రాగానే వెళదాం ." కారు స్టార్ట్‌చేస్తూ మరోసారి నావేపు చూచి, హుషారుగా తలెగరేసి అన్నాడు రాజా...మరు నిముషంలో కారు వెళ్ళిపోయింది. సిటీ బార్డర్స్‌లో వున్న పెద్ద మలుపు ఇది. రెండు సంవత్సరాల క్రితం వరకూ ఇక్కడ ఇండ్రస్ట్రియల్ బిల్డింగ్స్ తప్ప


# మలుపులో మనుషులు

పవని నిర్మలప్రభావతి



జ్యోతి కథల పోటీలో

తృతీయ బహుమతి పొందిన కథ




మరేమీ వుండేవి కావు. కానీ ఇప్పుడు చాలా బంగళాలు వెలిశాయి .... ఆ మూలగా, ఓ ఫర్లాంగు దూరంలో కనిపిస్తున్న ఎత్తైన నీలి రంగు బంగళా డాక్టర్ సుశీలది. ఈ మలుపులో తరచూ కారు, లారీ, బస్సు ప్రమాదాలు జరుగుతుంటాయి. మలుపు తిరగటంలో కొన్ని, ఎదురుగా వస్తున్న వాహనాన్ని చూచుకోక, కేర్ చెయ్యక మరికొన్నీ! అందుకే "డెత్ కార్నర్!" అంటారు దీన్ని ముద్దుగా! డాక్టర్ సుశీల మెడిసిన్‌లో నా క్లాస్‌మేటు. సిటీలో నాతోబాటే ప్రాక్టీసు పెట్టింది. గత పదేళ్ళలో సైకియాట్రిస్ట్‌గా నేనెంత పేరూ, పలుకుబడీ, డబ్బూ సంపాదించానో, తను అంత అట్టడుగుకు పడిపోయింది! ఆర్థికంగా చాలా ఇబ్బందులకు లోనయింది. ఎలా వచ్చిందో ఈ ఐడియా, ఈ కార్నర్‌కు ఓ ఫర్లాంగు దూరంలో డిస్పెన్సరీ ఓపెన్ చేసింది! ఆ క్షణం ఎలాటిదో గానీ, ఈ కార్నర్‌లో జరిగే ప్రమాదాల తాలూకు ప్రథమ చికిత్సలూ, ఓ మోస్తరు వైద్యమూ, ఆపరేషన్స్ ఆమెకు అంది వచ్చిన అవకాశంగా మారి, రెండేళ్ళలో ఆమె "శీలా నర్సింగ్ హోం" మంచి గుర్తింపు పొందించి! ఇప్పుడామె పేరు

సిటీలోని లీడింగ్ డాక్టర్ల సరసనవుంది. ఇంకా పెళ్ళాడలేదు.

"పెళ్ళిదేమిటి రమణా! నా దృష్టిలో అదో పెద్ద ఇష్యూ కాదు!" అంటుంటుంది తరచూ. రెండు మార్లు తన బర్త్‌డే ఫంక్షన్స్ ఘనంగా జరుపుకొని పార్టీ ఇచ్చింది. ఐదారుమార్లు ఏవేవో చిన్నచిన్న సందర్భాలు పురస్కరించుక పార్టీ ఇచ్చింది. ముఖ్య అతిథిగా నన్ను

చాలా గౌరవిసుంది. అభిమానిస్తుంది.

"ఈ కార్నర్‌లో ప్రమాదాలు అరికట్టే గట్టి చర్యలు తీసుకొంటే బావుండును సుశీలా! స్ట్రీట్ లైట్లు వున్నాయేగానీ, సరిగా మలుపులో వాటి వెలుతురు ప్రసరించదు!" అన్నానోసారి.

"బాబ్బాబు! పెద్దగా ఆ మాటనకు! మునిసిపల్ కమిషనర్ నిజంగా నడుంకట్టి, ఈ మలుపులో ప్రమాదాలు అరికట్టే ప్రయత్నాలు చేశాడంటే నా ప్రాక్టీసు గోవిందా!" అంది నవ్వుతూ.

సుశీల చాలా స్నేహశీలి! జీవితాన్ని కేవలం థ్రిల్‌గానే తీసుకొనే మనస్తత్వం ఆమెది. ఆమె స్నేహితుల జాబితాలో చాలామంది మినిష్టర్స్ మొదలుకొని యాక్టర్ల వరకూవున్నారు. హైక్లాసు ఫామిలీ స్త్రీలు చాలామంది సుశీల బంగళాలో, నర్సింగ్ హోంలో తరచూ కన్పిస్తుంటారు. వాళ్ళకేం జబ్బులో తెలియదుగాని సుశీల బంగళాలో అన్నిరకాల సదుపాయాలూ పొంది, ఆమెకు అంతులేని సిరి చేకూరుస్తున్నారని మాత్రం తెలుసు.

అసలు ఇన్ని వివరాలు నాకు తెలియకనే పోను! నా క్లాసుమేటు రాజా ఫస్టియర్ మెడిసిన్‌తో చదువాపేశాడు...ఆ తర్వాత వాడు అలా అలా గాలికి తిరిగి....రెండు సంవత్సరాల క్రితం నా దగ్గరకి వచ్చాడు. ఏదయినా వుద్యోగం అదెంత చిన్నదయినాసరే. కారు డ్రయివరుగానయినాసరే ఇప్పించమంటూ! జాలి కొద్దీ చేరదీశాను. కంపౌండరుగా, స్టోర్‌రూం మేనేజరుగా. బాధ్యత యిచ్చాను. కృతజ్ఞతతో బాధ్యతగా, నమ్మకంగా నా నర్సింగ్‌హోమ్ పనులన్నీ స్వంత మనిషిలా నిర్వహిస్తున్నాడు. నాకదెంతో సంతోషాన్ని కలిగించింది.

అయితే, వాడిదగ్గరున్న ఒకే ఒక బలహీనత.."వుమెన్ వీక్‌నెస్!" అది నేనేవిధంగానూ అరికట్టలేక పోయాను. "నా బలహీనతేదో నా దగ్గరే కదావుంది రమణా! అది నిన్నుగానీ, మరొకర్నిగానీ బాధించటంలేదు . . నేనందుకే పెళ్ళిలాంటి "బంధం"లో ఇరుక్కోదల్చుకోలేదు. ప్లీజ్! పదేపదే నాకు సలహాయివ్వకు!" అన్నాడోరోజు.. "ఫ్రెండ్‌గా నీ హద్దులని అతిక్రమించకు!" అన్న హెచ్చరింపు వున్నట్లుందా మాటలలో! మరెప్పుడూ నేనా విషయమై వాణ్ని మందలించలేదు.

తర్వాత వాడే ఓరోజు సుశీల "డెత్ కార్నర్" దగ్గరగా బంగళా కట్టించేస్తోందనీ ఆమె బంగళాలో చాలాచాలా అందమయిన అమ్మాయిలు..బాగా డబ్బున్నవాళ్ళు, కేవలం.. "సరికొత్త అనుభవాలకోసం" మాత్రమే, ట్రీట్‌మెంటు సాకుతో వుంటుంటారని విశేషాలు చెప్పాడు. కావలిస్తే రుజువు చేస్తానని కూడా సవాలు చేశాడు. ఆ కుతూహలమే నన్ను మలుపులోకి నడిపించింది..

ఆరునెలలుగా ఈ మలుపు నాకు బాగా సుపరిచితమై పోయింది! రాజా కారు డ్రయివ్ చేస్తాడు. ఈ మలుపులో నన్ను డ్రాప్ చేస్తాడు. వెళ్ళిపోతాడు. నేనిక్కడ వెయిట్ చేస్తుంటాను ప్రతి మంగళవారం సాయంత్రం! డాక్టర్ సుశీల వయ్యారంగా నడుచుకుంటూ వస్తుంది. ఒకోసారి ఆమెవెంట మెరుపుతీగెలాంటి స్త్రీ...వివాహితో, అవివాహితో...వుంటుంది....సుశీల పరిచయాలు చేస్తుంది..సరదాగా నడుచుకుంటూ, కబుర్లాడుకుంటూ సుశీల బంగళా చేరుకుంటాం. చూసేవాళ్ళు, ఇద్దరు డాక్టర్స్ యధాలాపంగా కబుర్లాడుకుంటూ వెళుతున్నట్లుంటుందే గానీ, మరో ఆలోచనకు ఆస్కారం కలగదు. బంగళాచేరాక. .బంగళాలో మేడమీద విశాలమైన బెడ్‌రూం...అందంగా అమర్చిన ఫర్నిచర్ మనిషిలోని అజ్ఞాత వాంఛల్ని ప్రోత్సహించే దృశ్యాల . . చిత్రాల మధ్య....వదలి సుశీల మెల్లగా తప్పుకుంటుంది. .

ఆ స్త్రీలతో అనుభవం చాలా థ్రిల్లింగ్‌గా వుంటుంది! వాళ్ళు కేవలం "సెక్స్"అనుభవాల కోసం, ఆరాటం కోసమే జన్మించారా అనిపిస్తుంది! చాలామందికి బోలెడంత సంపదవుంది. కానీ ఆ భర్తలు వాళ్ళబిజినెస్....వాళ్ళగోలలో వుండిపోయి వీళ్ళని నిర్లక్ష్యం చేశారనే సైకలాజికల్ ఫీలింగ్ .... పగ! మరి కొందరికి భర్తలు తాగుబోతులూ....నీరసులూ! వారి నుంచి నిజమైన ప్రేమానుభూతి పొందలేని

నిస్పృహ! ఇంకా కొందరికి.... పెళ్ళి అనేది ఓ పంజరంలా తోస్తుందట ...లైఫ్ ఈజీగా.... బాధ్యతా రహితంగా సాగిపోవాలిట!

ఈ వింతవింత మనస్తత్వాల మధ్య నా సైకియాట్రిస్ట్ మనస్సు ఏదో కొత్త అను భూతినీ, హాయినీ అనుభవిస్తోంది....కానీ.... రాత్రి తొమ్మిదిగంటల ప్రాంతంలో ఆ మలుపు లోనే ... నాకోసం కారుతెచ్చి సిద్ధంగావుండే రాజాను చూడగానే గిల్టీగా ఫీలవుతాను! అంత క్రితంవరకూ దూదిలా తేలిపోతున్న హృదయం ఒక్కసారిగా బరువెక్కిపోతుంది!

రాజా నన్నీ మలుపులోకి... బలహీనతలోకి తెలివిగా తోశాడా? రాజాకు తెలిసిన ఈ రహ స్యం .... వాడు నాకో బ్లాక్‌మెయిలర్‌లా తయారు చేస్తుందా? ఊహూఁ! వాడలాంటి వాడుకాడు! లక్ష్మికి తెలిస్తే? లక్ష్మి....! అవును! లక్ష్మి పెద్దగా చదువుకున్నది కాదు. కానీ సంసారాన్ని తెలివితేటలతో దిద్దుకునే విద్య ఆమెకు తెలుసు! నన్నూ నా యిద్దరు పిల్లల్నీ....అనుక్షణం కంటికి రెప్పలా కాపాడు తుంటుంది! నేనెక్కడికి వెళుతున్నా, వచ్చినా, ఎక్కడికని? ఏమిటనీ అడగదు....నా వృత్తి రీత్యా వెళ్తొస్తున్నాననుకుంటుంది. నా సరదా లకు అడ్డురాదు! అలాంటి గృహలక్ష్మికి ద్రోహం చేస్తున్నానా అన్న ఆలోచన తొలిచే స్తోంది నన్ను. అమాటే అన్నాను రాజాతో...

"పిచ్చి ఆలోచనలు పెట్టుకోకురా రమణా! నిద్ర లేచింది మొదలు సైకియాట్రిస్ట్‌గా ఎంతో మంది మెంటల్ పేషెంట్సుతో వేగ వలసిన నీకు ఆమాత్రం రిక్రియేషన్ - రిలాక్సేషన్ ఏర్పరచుకోవటం తప్పుకాదు రమణా! తప్పని సరి కూడాను! చెల్లాయి లక్ష్మికి తెలియవలసిన అవసరమూలేదు .... తెలిసినా, ఆమె పెద్దగా రభస చేస్తుందనుకోను! కారణం ఆమె నీ ఆనందం తప్ప మరోటి కోరని వున్నత, వుత్తమ ఇల్లాలు!" అనేశాడు.

అలాంటి అమాయకురాలికి ద్రోహం చేయ టము సామాన్యమైన నేరమా? అసలింతటి బలహీనత ఊబిలో నేనెందుకు కూరుకు పోయాను! ఏ మంగళవారానికావారం...ఈసారి ఒక్కసారే....ఈసారి సుశీలకు చెప్పేస్తాను.. యిక రాననీ... నాకోసం ఎవర్నీ ఎంగేజ్ చేయ వద్దని... రాజాకు చెబుతాను....అసలీ మలుపు వేపు పొరబాటుగా కూడా కారు మళ్ళించవద్దని.

ఈ శపథాలన్నీ ఏమైపోతాయో తెలీదు... ఈ మలుపులోకి మనసు మళ్ళుతుంది ప్రతి సారీ. ..ఈసారీ....

ఆటో దగ్గరలో ఆగిన చప్పుడవటంతో ఆలోచనల్లోంచి త్రుళ్ళిపడ్డాను. మలుపు తిరిగే చోట ... రోడ్డుకవతలగా .ఓపెద్ద ఇండస్ట్రి యల్ బిల్డింగ్ కాంపౌండు వాల్‌వుంది. అసలా గోడ మూలంగానే అక్కడెప్పుడూ స్ట్రీట్ లైట్ వెలుతురు ప్రసరించకుండా చీకటిగా వుంటుంది. బాగా అలవాటుపడిన వారికిగానీ, స్పీడుగా వాహనం నడుపుతుంటే అక్కడ మలుపున్నట్లు చటుక్కున స్ఫురించదు.

ఆటోలోంచి మోహన్‌రావు, రోహిణి, వారి ఇద్దరు పిల్లలూ దిగారు. మీటరుచూచి ఆటో డ్రయివరుకు డబ్బిచ్చి పంపాక, వెను దిరిగి చూచిన మోహన్‌రావు, చీకటి పరుచు కుని వున్న ఆ మలుపులో నన్నుచూసి గతుక్కు మన్నాడు. "నమస్కారం డాక్టరుగారూ!" అన్నాడు చిరునవ్వు తెచ్చుకుంటూ. రోహిణి కూడా గతుక్కుమన్నట్లు, విధిలేనట్లు "నమ స్కారం డాక్టరుగారూ!" అంది.

"నమస్కారం ... ఆరోగ్యం బావుందా?" అన్నాను...


"ఊఁ!" ఇద్దరూ తలూపారు ... "మీరు యిక్కడున్నారేమిటి?... మీకాపుగానీ ట్రబు లిచ్చిందా?" అన్నాడు మోహనరావు నాకారు కోసం చుట్టూరా చూస్తూ.

"లేదు. ఓ ఫ్రెండ్‌కోసం ఎదురుచూస్తూ న్నాను." అన్నాను లోలోపల తడబాటు అణచు కుంటూ.

"ఓహోఁ! వస్తాం...." ఇద్దరూ యిబ్బం దిగా ముందుకు నడిచారు పిల్లలతో కూడా! వీళ్ళిద్దరూ యిక్కడికెందు కొచ్చినట్లు?

నెలరోజుల క్రితం నాదగ్గర ట్రీట్‌మెంట్

# (వి) చిత్ర విజ్ఞానం



దృష్టి లోపాలు (చత్వారం) జంతువుల్లో కూడా వున్నాయి! పారిస్‌లోని మాడామ్. డెనిస్ రేమియర్ అనే ఓ కంటిడాక్టరు. పిల్లులూ, కుక్కలూ చింపాంజీలు, గుర్రాలు మొదలగువాటికి కళ్ళజోళ్ళు తయారుచేసింది. పారిస్ నగరంలోని ప్రతి పౌరుడి యింటిలోనూ పెంపుడు జంతువులకు తక్కువలేదు కనుక, యీవిడ, హాస్పిటల్ ఎప్పుడూ కుక్కలూ, పిల్లులూ మొదలగు వాటితో కిటకిటలాడుతూ వుంటుందట!

---

పూర్తయి వెళ్ళారిద్దరూ. ఇద్దరూ పెద్దబ్యాంకిలో ఉద్యోగాలు చేస్తున్నారు. బోలెడంత డబ్బు వస్తుంది. ఇద్దరు పిల్లలతో సుఖంగా జీవనం గడపవచ్చు! కానీ ఎలా అలవాటైందో, పెథిడ్రిన్ అడిక్ట్సుగా మారిపోయారు! ఇల్లూ, ఒళ్ళూ గుల్లయిపోయింది! అప్పులు పెరిగిపోయాయి, ఇద్దరిదీ ఇంటర్‌కాస్ట్ మారేజ్ కావటంవల్ల ఇరువేపులా ఎవరూ పట్టించుకోలేదు కోపంతో! రాజాకు దూరపు బంధువులూ, స్నేహితులూ అట! రాజా బలవంతంమీద ట్రీట్‌మెంటు ఇచ్చాను. మెదడులోని ఓ ముఖ్యమైన "సెల్" ఆపరేషన్ ద్వారా ఆ అడిక్షన్ అరికట్టవచ్చు ... కానీ పేషెంట్సులో దృఢనిశ్చయం వుండాలి, ఆ వ్యసనంనుంచి బయటపడాలని....డిశ్చార్జి చేస్తూ చాలా జాగ్రత్తలు చెప్పాను....మార్ఫియా పెథిడ్రిన్, బ్రౌన్‌షుగర్ లాటివి కళ్ళతోచూడవద్దనీ, చేతితో తాకవద్దనీ, అవి అమ్మే దళారులతో మాట్లాడవద్దనీ .... అలా యెన్నో మరెన్నో!

ఈరోజు ఈ కార్నర్‌లో దిగారెందుకు?

ఈ మలుపు ఇలాంటి అడిక్ట్సుకు కామధేనువు! ఆ కనిపిస్తున్న వూడలుదిగిన విశాలమైన మర్రిచెట్టు చాటున....ఆ మత్తుద్రవ్యాలు బ్లాక్‌లో అమ్మే ఘరానా మనుషులుంటారు....

ఎక్కడికయినా వెళ్ళాలని దిగారో, లేక తిరిగీ ఆ వ్యసనానికి బానిసలౌతున్నారో.. .అదే నిజమైతే . నా ట్రీట్‌మెంట్ అంతా బూడిదలో పోసిన పన్నీరే! వాళ్ళిద్దరూ ఈ మలుపు తిరిగిపోతే బావుండును...

"హలో రమణా!" పిలుపుతో ఉలిక్కిపడ్డాను.

"ఎంతసేపయింది వచ్చి?" మృదువుగా అడిగింది డాక్టర్ సుశీల. ..

"ఇప్పుడే ఓ పదిహేను నిమిషాలయి వుంటుంది" ఏదో తడబాటు నాలో....

"సారీ! ఓ డెలివరీ కేసు కంప్లీట్‌చేసి వచ్చేసరికి ఆలస్యమైపోయింది. మీట్‌మై ఫ్రెండ్ లలిత!" అంటూ అందాకా తనవెనుక మలుపులోని చీకటిలో నిల్చునివున్న యువతి చేతిని నాచేతి కందించింది డాక్టర్ సుశీల! ముదురు నీలిరంగు జపాన్ జార్జెట్‌చీరె, అదే రంగు బ్లవుజులో .ఆ చీకటిలో....మెరుపు తీగలా కళ్ళు మిరుమిట్లు గొలుపుతుంది లలిత.

"గ్లాడ్ టు మీట్ యూ!" మా యిద్దరి చేతులూ కలుసుకున్నాయి. ..ఏదో విద్యుత్తు.... సంకేతం....అందాకా ఒకరికొకరం తెలియకపోయినా....ఆ క్షణంలో పరస్పరం అత్యంత సన్నిహితులమైనట్లు అనుభూతి .... జీవితపు హద్దుల్ని, సంఘపు కట్టుబాట్లనీ, ధర్మాధర్మాల

సరిహద్దులనీ, మలుపుతిప్పి, అతిక్రమించి కొత్త స్వర్గాలని సృష్టించు కోవాలన్న వెర్రి ఉద్వేగం....

"పదండి వెళదాం!" సుశీల తెలివిగా ఇద్దరి మధ్యకొచ్చి నడుస్తోంది. ఆ ఫర్లాంగుదూరం నడకా... కేవలం యిద్దరు అపరిచితుల మధ్య, ఓ విధమైన సన్నిహితత్వాన్ని రూపొందించ టానికే! సుశీల బుర్రలో ఈ రకమైన అతి తెలివి ఎలా ఉత్పన్నమైందో . ?

ఈ రోజు... ఈ ఒక్కసారి. .ఈ లలితలో అంతే! ఆ తర్వాత సుశీలకు చెప్పేస్తాను. ఈ మలుపులోకి రానని.. .

"ఏమిటీ? మూడీగా వున్నావు రమణా?" సుశీల అంది .

"అబ్బే! లేదే!" తడబడ్డాను..

"హలో డాక్టరుగారూ!" మలుపు తిరగ బోతున్నాం. ఎదురుగా రిక్షా ఓ కొన్నంతపని అయి ఆగింది! ముగ్గరం విడివిడిగా తప్పు కున్నాం. రిక్షా ఆగగానే.. .రిక్షాలోంచి దూకుతూ అన్నాడు శ్రీహరి . రిక్షాలోనే శిలా ప్రతిమలా కూర్చునివుంది మేనక . సజీవ శిల్పంలా!

"నమస్కారం" అన్నాను.

"డాక్టరుగారూ! మీతో ఓ చిన్నవిషయం మాటాడాలని మీ నర్సింగ్ హోం కెళ్ళాం! మీరు లేరని తెలిసింది. బహుశా పిక్చర్ కెళ్ళి వుంటారని అనుకున్నాం. ఇక్కడో ఫ్రెండును కలిసి, ఈ రాత్రి ట్రెన్ కే టికెట్లు రిజర్వ్ చేయించుకుందామని వెళ్తుంటే లక్కీగా మీరు కనిపించారు... " అన్నాడు శ్రీహరి.

"సుశీలా! మీరు మెల్లిగా నడుస్తుండండి. జెస్టెమినిట్!" అన్నాను నాకోసం చూస్తున్న సుశీల, లలితలతో. ..

"ఆల్ రైట్!"అంది సుశీల. ఇద్దరూ మెల్లి గా అతిమెల్లిగా....నడుస్తున్నారు. లలిత నడకలో.. కళ్ళలో.. .అణువణువులో. . ఏదో కాంక్ష . క్షణకాలంకూడా ఆలస్యం భరించలేనంతటి తృష్ణ....కనిపిస్తోంది నాకు ...బహుశా కాస్త "హాట్" డ్రింకేదో తీసుకున్నట్లుకూడా వుంది అంతక్రితమే! నాలోనూ ఓ విధమైన థ్రిల్ నిలవనివ్వటంలేదు .... పానకంలో పుడకలా శ్రీహరి తయారయ్యాడు! ఇలాటి సమయాలలో అనారోగ్యాలకు సంబంధించిన వివరాలూ, ప్రిస్క్రిప్షనూ చెప్పాలంటే తగని చిరాకు నాకు.

మేనకకూడా రిక్షా దిగించి. ముగురం నాలు గడుగులు వేసాం. మేనకను అక్కడే ఆగ మని చెప్పి, శ్రీహరి నా దగ్గరసా వచ్చాడు. రహస్యం చెబుతున్నట్లుగా అన్నాడు "డాక్టరు గారూ! ఈ రాత్రికే ఇద్దరం వెళ్ళిపోతున్నాం.. అస్సాం ప్రాంతానికి ట్రాన్సఫర్ ఆర్డర్స్ వచ్చాయి! మేనక ఆరోగ్యం పూర్తిగా కుదుట బడ్డట్లే గదా? ఆమె... ఆమె .. దాంపత్య జీవి తానికి. ." శ్రీహరి కర్చీఫ్‌తో మెడ తుడుచు కుంటున్నట్లుగా కాస్త ఇబ్బందిగా నావేపు చూస్తూ చటుక్కున అన్నాడు " ఐమీన్. . సెక్స్‌కు. . పూర్తి అర్హురాలేనా?"


నేను నవ్వాను. "ఆవిడ ఫిజికల్ కండిషన్‌లో ఏలాటి లోపమూ లేదు. సిల్లీ అనుమానాలు పెట్టుకోకండి. కానీ ఆమె తలలోని టెంక్షన్ సప్రెస్ అయివుండటానికి ఇంకా కొంతకాలం ఆ స్లీపింగ్ టాబ్లెట్స్ వాడాలి! కానీ. ఒక్క విషయం.. .ఆమెకు ట్రీట్‌మెంటు ఇచ్చిన సైకియాట్రిస్ట్‌గా ఇస్తాను...."

శ్రీహరి కంగారు కప్పిపుచ్చుకుంటూ రాని నవ్వు నవ్వాడు "చెప్పండి డాక్టర్! మీ సలహా కోసమే కదా, మీకోసం మీ బంగళాకు వెళ్ళాను!"

"ఇఫ్ యు డోంట్ మైండ్ . మీ ప్రవర్త నలో బాగా మార్పు రావాలి! ఆమెను మీరు ప్రాణప్రదంగా చూచుకుంటారనీ, మీరామెకు సంపూర్ణ రక్షణ కల్పిస్తారనీ, కాన్ఫిడెన్స్ ఆమెకు మీరే కలిగించాలి. ఆవిడ మనసు నొప్పించే సంఘటనలూ, వాతావరణమూ కల్పించవద్దు .. . డాక్టర్‌గా నా సలహా అదొక్కటే!" ఆ మాటలంటుంటే ఎందుకో నా లక్ష్మి గుర్తొచ్చినా శరీరమంతా రోమాంచిత మైంది ఒక్కసారిగా.

"ఆల్‌రైట్ డాక్టర్! మేనక నా ప్రాణం! మరి వెళ్ళొస్తాం!"

అందాకా, శిలాప్రతిమలా మాకు కొద్ది దూరంలో, సెడెటివ్స్ ఎక్కువ డోస్ తీసు



కుంటున్నందువల్ల ఓ రకమైన మొద్దుతనంతో నిద్రమత్తు వ్యక్తిలా వున్న మేనకకూడా "నమస్కారమండీ!" అని చెప్పి, భర్తపక్కన రిక్షాలో కూర్చుంది.. .రిక్షా మలుపు దాటుతోంది.

అలాగే నిల్చుండి పోయాను.... వెళ్తున్న రిక్షా వేపు చూస్తూ.

శ్రీహరి మేనక

సరిగ్గా రెండు నెలల క్రితం ఓ శతవృద్ధు. . అజంతా శిలాసుందరి లాటి సజీవమూర్తిని వెంటబెట్టుక వచ్చాడు నా డిస్పెన్సరీలోకి! ఆ యువతి మెంటల్‌గా షాక్ తినివుంది! "మెంటల్ డి-కండిషన్" అది! వెర్రిచూపూ, పిచ్చిగా ఏడుపూ, తిట్లూ, కాస్సేపు నవ్వూ, హఠాత్తుగా వెర్రి ఆవేశం... ఫిట్సూ. .వస్తున్నాయి.

వృద్ధుడు, కళ్ళు తుడుచుకుంటూ చెప్పాడు. "ఇది మంగళ. నా కూతురి కూతురు! మనవరాలన్నమాట! దీన్ని కనగానే, తల్లి చనిపోయింది. ఆ తర్వాత ఆ దిగులుతో మా అల్లుడూ దేశాలు పట్టి పోయాడు! నా భార్య అంతక్రితమే చనిపోయింది! ఇందర్ని చంపి ఇదొక్కటీ బ్రతికింది! చచ్చి చెడీ —— దీన్ని పెంచి పెద్దచేశాను! మిలట్రీలో పెద్ద ఆఫీసరుగా వున్న శ్రీహరి.... దీన్ని చూచి, కోరి చేసుకున్నాడు పెళ్ళి! ఇద్దరూ అతని ఉద్యోగరీత్యా కాశ్మీరునుంచి కన్యాకుమారి వరకూ తిరుగుతున్నారు ఈ ఏడేళ్ళుగా! అంతటితో నా బాధ్యత తీరిందనుకున్నాను. బిడ్డ సుఖపడుతున్నదనుకున్నాను . . ఏమయిందో, ఏమో . దీనికి పిచ్చెక్కిందని, పిల్చుకొచ్చాడు . !" "కారణం ఏమిటో చూచాయగానైనా తెలుసుకోగలిగారా?" అన్నాను ఆ యువతికెలా ట్రీట్‌మెంటు మొదలెట్టాలో మనసులో అంచనా వేసుకుంటూ! ఆ యువతివేపు పరిశీలనగా చూశాను. చాలా అందమైన, అమాయకురాలైన స్త్రీ అనిపిస్తుంది. .. నా లక్ష్మిలానే! "మంచి ఇల్లాలు!" అనే గౌరవ భావం కలిగిస్తుంది.. .

"ఆ! అడగ్గా అడగ్గా బయటపెట్టాడు వెధవ....అలా వెళదాం రాండి!" అన్నాడా వృద్ధుడు. నర్సును మేనకకు తోడుగా వుంచి, ఆ వృద్ధుడితో పక్కరూంలోకి వెళ్ళాను.

వాడు....ఆ శ్రీహరి .... మిలట్రీ ఆఫీసరన్నాను కదా? వాడికి చావంటే ఎలా భయం లేదో, బ్రతుకన్నా అంతే ఖాతరు లేదట! వాడే చెప్పాడు! అక్కడ తమకు ఎక్కువ నియమా

లుండవట....వుండేవాళ్ళు ఎక్కడైనా నీతిగా వుంటారనుకోంటి...వాడు పార్టీలలో పాల్గొంటాడట! అక్కడ ప్రేమ....చాలా స్వేచ్ఛ! వాడు ఇతరుల భార్యలతో....ఇతర స్త్రీలతో....తిరుగుతాడట ...అదో తప్పుగా పరిగణించరట .... దీన్నికూడా అలా తిరగమని . .ఒకళ్ళ భార్యల్ని మరొకరు అనుభవించే కొత్త ఆటట. .. ఛీ. ..ఛీ....పశువుల్లా!" ఆ వృద్ధుడిక చెప్పలేక, పై పంచతో ముఖం కప్పుకున్నాడు!

సిటీలలో, ఓ మోస్తరు టౌన్లలో, బ్లూఫిలిమ్స్ ద్వారా పాకుతున్న గేమ్ ఇది ఇప్పుడిప్పుడే! నాగరికతకిది పరాకాష్ఠగా భావింపబడుతుంది ... ఈ వృద్ధుడికిదంతా కొత్త గందరగోళం .. బహుశా పల్లెటూరిలో పుట్టి పెరిగి, సాంప్రదాయాలలో పుట్టి పెరిగిన మంగళకూడా అది షాక్ ఇచ్చి వుంటుంది..

"దీనిపేరు "మంగళ" బాగాలేదని మేనకగా మార్చాడు ...అలా దీన్ని తిరగమనీ, లేకపోతే, తన స్నేహితులు తనని బాధిస్తారనీ....బాధపెట్టేవాడుట ...బేజారెత్తి మతి చెడగొట్టుకుందీ పిచ్చితల్లి! నేను కాటికి కాళ్ళు జాచుకున్నాను. పిల్లది బాగుపడ్డాకయినా. . వాడితోనేగదా బ్రతకాలి? మొగుడిదగ్గరే ఆడదానికి రక్షణ లేకపోతే. . .ఇక లోకంలో ఎక్కడుందంటారు?"

వృద్ధుణ్ని ఓదార్చటం నా తలకు మించిన పనైంది! ముందీ షాక్‌తో ఆయనెక్కువకాలం జీవించడని తేలిపోయింది.

"వాణ్ని మీ దగ్గరకు పిల్చుకొస్తాను. నే చెప్పినట్లు కాకుండా, మీరే వివరాలన్నీ అడిగి, గడ్డిపెట్టండి బాగా!" అన్నాడా వృద్ధుడు చివరగా!

షాక్ ట్రీట్‌మెంట్లు ప్రారంభం అయ్యాక . శ్రీహరి వచ్చాడు... శ్రీహరి ద్వారానే వివరాలన్నీ లాగగలిగాను! శ్రీహరి చూడటానికి చాలా అందగాడే! చదువూ సంస్కారం వున్న యువకుడే! మరీ విపరీతం? బలహీనతా! అనుకోకుండా మలుపు తిరిగిందా అతగాడి జీవితం....? స్నేహంగా అడిగాను వివరాలు. శ్రీహరి నొచ్చుకుంటూ చెప్పాడు.

"అదో విషవలయంలా మారింది డాక్టర్! నేనే ఓ బలహీన క్షణంలో....నా ఫ్రెండు భార్య ఒకర్తె .... చాలా బ్యూటిఫుల్ లెండి" అడ్వాన్స్‌డ్ లేడీ కూడా .... ఆమెమీది మోజుతో. ..ఈ తమాషా గేమ్ ప్రారంభించాను.. .అది ఫ్రెండ్సందరికీ నచ్చింది ...కానీ అదే నా మెడకూ వురి అవుతుందనుకోలేదు....

ఇప్పుడా ఫ్రెండ్సంతా .... మేనకనుకూడా అలా మా పార్టీలో పార్టిసిపేట్ చేయించాలంటారు .నాకూ చాలా కష్టం....కానీ.... వాళ్ళు వదలరే! "నువ్వు మొదలెట్టిన గేమ్. .. నువ్వే ఆట నిబంధనలు అతిక్రమిస్తే ఎలా? ససేమిరా ఒప్పుకోం!" అని నిష్ఠూరం ఆడుతున్నారు. నిష్ఠూరం ఏమిటో వాళ్ళలో కొందరు "వైలెంట్"గా కూడా నన్ను ప్రెస్‌చేస్తున్నారు . . నాకు తప్పించుకొనే మార్గం కనిపించలేదు. మేనకమీద వత్తిడి తెచ్చాను ... ఫలితం మేనక మతి చెడిపోయింది. !"

వింటున్న నాలో ఓ రకమైన గగుర్పాటు కలిగింది.

"బాడ్‌లక్! జరిగిందేదో జరిగిపోయింది! అక్కణ్నుంచి ట్రాన్స్‌ఫర్‌కు ప్రయత్నించండి! ఆ విషవలయంలోంచి మీరు ఎలాగోలా బయట పడండి! ఆవిడని నొప్పించకండి! భర్తే దైవంగా భావించే ఇల్లాలు లభ్యంకావటం మగాడికో మహత్తర వరం!" నా గొంతుక నాకే చిత్రంగా కంపిస్తూ వినిపించింది. ఆ మాటలే నా లోపల్నుంచి ప్రతిధ్వనించినట్లనుభూతి కలిగింది!

నెల రోజుల్లో ట్రీట్‌మెంటు పూర్తయింది. మేనకకు ఇప్పుడేమీ గుర్తులేదు. మెదడులోని ఆలోచనలకూ, ఉద్రేకాలకూ సంబంధించిన అన్ని నరాలూ, ముఖ్యకేంద్రాలూ, సెడెటివ్స్‌తోనూ, షాక్స్‌తోనూ మొద్దుబారిపోయి వున్నాయామెకు! ఇంకా నాలుగైదు నెలలు ఇదే రకంగా మందులు, విశ్రాంతి కంటిన్యూ చేస్తేనే కానీ, ఆ తర్వాతగానీ ఆమె మామూలు మనిషి కాలేదు! ఆమెలో ఆ చైతన్యం తిరిగి రావటానికి శ్రీహరి చాలా ఓర్పు వహించాలి!

శ్రీహరి, మేనక ఈరోజు వెళ్తున్నారు. వెళ్ళక తప్పదు. మేనక నా వృద్ధుడు భరించ

లేదు. శ్రీహరికా ఉద్యోగం లేకపోతే జీవన భృతి లేదు! శ్రీహరి తన ప్రవర్తన మార్చుకుంటాడా? అతగాడా విషవలయాన్ని ఛేధించుకోగలడా? ఆ "డెత్ కార్నర్"ను దాటిపోగలడా? లేక ఆమె శాశ్వతంగా మెంటల్ పేషంటుగా, పిచ్చిదానిగా మారిపోయి. . అతగాడికి బరువై పోయి....భయంకరమైన మరణం పాలు....

"రమణా!"

త్రుళ్ళిపడ్డాను. తల పగిలిపోతున్నట్లుంది. సుశీల పిలుపు ఏదో భయంకరమైన యాక్సిడెంటుకు ముందు — కారునుంచి వచ్చే శబ్దంలా వుంది! అసహనంగా చూస్తూ సుశీల, విసుగు బయట పడకుండా చిరునవ్వు నవ్వటానికి ప్రయత్నిస్తోంది...

"రమణా! ఏమిటీ? ఆ జిడ్డు ఫ్రెండ్ వదల్లేదా?"

"ఊహుఁ! పద సుశీలా! జస్టే మినిట్! వస్తా పద!" అన్నాను. ఎందుకో శరీరమంతా చెమటలు పడుతోంది.

సుశీల అసహనంగానే, కాస్త వడివడిగా బంగళావేపు అడుగులు వేస్తోంది! బహుశః "బెట్టుచేస్తున్నాడు రమణ! ఎందాకా ఈ బెట్టు? అవసరం, బలహీనత అతగాడిది గానీ, నాక్కాదే! వస్తాడు. ఎవరికోసం?" అనుకొంటోందేమో!

మలుపులో నిల్చుండిపోయానలాగే!

శ్రీహరి.. .మేనక....

మోహన్‌రావు... రోహిణి....

నేనూ....రాజా....

ఏమిటో చుట్టూరా వలయాలు....

ఎందరి మనస్తత్వాల మీదో నా ట్రీట్‌మెంటుతో మార్పు తెస్తున్నాను. విజయం సాధిస్తున్నాను . .. మరి ఈ మలుపులోంచి నేను తప్పుకోలేనా?

ముందస్తుగా రాజాకు రేపొద్దునే ఉద్వాసన చెప్పాలి.. .లక్ష్మికి స్వయంగా చెప్పుకుని.... ఆ దేవత క్షమాపణ కోరాలి. .

"సార్! పది యాంపిల్సే వున్నాయి.... మార్ఫియా!"

దగ్గరలో గుసగుసగా వినిపించి తిరిగి చూశాను . మర్రిచెట్టు మాటునుంచి .... ఫుల్ సూటులో పెద్ద ఆఫీసర్లా వున్న ఓ దళారి వెధవ . .గుసగుసగా అంటున్నాడు. అటువేపు మనుషులెవరో చటుక్కున పోల్చుకోలేకపోయాను. . కళ్ళుబాగా విప్పార్చి చూశాక తెలిసింది....రోహిణి, మోహనరావు .. !

"సార్! పెథిడ్రిన్ మూడే వున్నాయి. బ్రౌన్ షుగర్ పది కాప్సూల్స్! ఏది కావాలి? ఏ మెడికల్ షాప్స్‌లోనూ దొరకటంలేదు ఇవ్వటంలేదు. ఎంత ఎరజూపినా బైటపెట్టటం లేదు ...! విదేశీ సరుకు ఇది! బొంబాయినుంచి నా ఫ్రెండొకడు చచ్చీచెడి సాధించి పంపాడు. ఒక్కొక్క యాంపిల్ పది రూపాయలన్నా, కొనేవాళ్ళున్నారు. ఎంచేతో మీ రంటే అభిమానం కలిగి, మీకు ఆఫర్ చేస్తున్నాను. త్వరగా తీసుకోండి. సిరెంజి కావాలన్నా నా దగ్గరే వుంది ...ఆలస్యం చేశారంటే....అదో ఆ కార్నర్ నుంచి ఓ పెద్ద మనిషొస్తాడిప్పుడు. చొరవగా నా పాంటు జేబిలో చెయ్యిపెట్టి అన్నీ లాక్కుంటాడు. నా జేబులో వందరూపాయల నోట్లు లెక్కపెట్టకుండా కుక్కేస్తాడు....ఆపైన మీ ఇష్టం...."

గుసగుసగా .... అంటున్న ఆ యువకుడి కళ్ళు రాబందు కళ్ళలా .... తనక్కావల్సిన మనుషుల్ని పోల్చుకున్నాయి....!

"రోహిణీ! ఒక్కటి.. .చెరొక్కటి తీసుకుందామా? ఇదే ఆఖరిసారి....మరి రేపట్నుంచీ వద్దు.. .ఏం?" మోహన్‌రావు అంటున్నాడు ఇంగ్లీషులో మెల్లిగా....

రోహిణి ఆలోచనగా అంటోంది "తీసుకుందామనే వుంది మోహన్! కానీ మళ్ళీ అడిక్ట్స్‌గా మారిపోతామేమో....పోనీ నువ్వన్నట్లు ఈ ఒక్కసారీ...."

"రమణా!" చాలా దగ్గరగా .... తియ్యని కంఠస్వరం....

తల తిప్పిచూశాను....భువన మోహనంగా వున్న లలిత లలితే! చాలా దగ్గరగా నిల్చుని రాతియుగంలోని . . ఆదిమానవులు .... కోరిక వెలిబుచ్చినట్లుగా....నాచేతిని తన చేతిలోకి తీసుకొంటోంది....

మలుపులో . ఆ డెత్ .... కార్నర్‌లో . నేనూ .. మరి కొంతమంది నాలాంటి మనుషులూ. నా అడుగులు ఎటుపడతాయో □